క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (శుక్రవారం) ఉదయం 11గంటలకు అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కతురోజు ఉమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నాగారం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సర్పంచ్ గట్టు నర్సింహారావు అన్నారు. 9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఇంటింటికి ఆరు మొక్కలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీఓ ధార శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జిందగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ పూలమ్మ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు ఉచిత వైద్యపరీక్షలు



అనాథాశ్రమంలో దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని దురాజ్‌పల్లిలో గల ఆలేటి ఆటం వరల్డ్ అనాథాశ్రమంలో మానసిక దివ్యాంగులకు గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సూర్యాపేటలోని శ్రేష్ఠ ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్యురాలు స్రవంతి పాల్గొని దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నెలరోజులకు సరిపడా మందులు పంపిణీ చేశారు. అనంతరం పండ్లు, బ్రెడు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు వనజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదబీమాను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి (సూర్యాపేట) : ప్రతిఒక్కరూ ప్రమాదబీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్ బేతెస్థ మినిస్ట్రీస్ ఆవరణలో సూర్యాపేట పోస్టల్ డివిజన్ అధికారి వల్లమూడి వెంకటేశ్వర్లు పోస్టల్ బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 10మంది పాస్టర్లకు పోస్టల్ ప్రమాద బీమా పాలసీని చేయించారు. పోస్టల్ శాఖ రూ.396లతో ఇచ్చే రూ.10లక్షల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బొజ్జ సునీల్‌కుమార్, గొని సురేష్, బొక్క ఏలీయారాజు, ప్రభాకర్, జాన్‌ప్రకాష్, కిరణ్‌కుమార్, బోయజ్, రూబెన్, లూకా, హోసన్నా, సైమన్‌రాజు పాల్గొన్నారు.

అచ్చమ్మ సేవలు మరువలేనివి

ఆత్మకూర్-ఎస్ : మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఎరగాని అచ్చమ్మ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని, ఆమె ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన అచ్చమ్మ సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామంలో జరిగిన అనేక భూమి, కూలి పోరాటాల్లో అచ్చమ్మ చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, జిల్లపల్లి నరసింహారావు, పులుసు సత్యం, వేల్పుల వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ నాయకులు ఎండీ జహీరుద్దీన్, బందారు నాగయ్య, బెల్లంకొండ మాణిక్యం, ఎరగాని లింగయ్య, ఎరగాని అచ్చమ్మ, కుమారులు ఎరగాని వెంకన్న, అంజయ్య, లింగయ్య, నాయకులు సైదులు పాల్గొన్నారు.

కందగట్లలో శ్రమదానం

ఆత్మకూర్-ఎస్ : మండల పరిధిలోని కందగట్ల గ్రామంలోని పలు వీధుల్లో డ్రైయినేజీలు పూడిపోవడంతో వర్షం నీరు వీధుల్లో చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతుండడంతో గురువారం వైస్‌ఎంపీపీ నేరెళ్ల వెంకన్న గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేపట్టారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



సూర్యాపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



తుంగతుర్తిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కొత్తబస్టాండ్ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి దయానంద రాణితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎస్సీ ఎస్టీ మానిటర్ సభ్యులు చింతలపాటి చిన్న శ్రీరాములు పాల్గొన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో..

మహాజన సోషలిస్టు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్నమాదిగ, చినశ్రీరాములు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కోట గోపి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు వల్లపట్ల దయానంద్, గోపి, కనుకుంట్ల వెంకన్న, బోడ శ్రీరాములు, పుట్టల మల్లేష్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నర్సింహరాజు, టీఏలు యాదమ్మ, దీపిక, సీఓలు సంతోష, రేణుక, నవీన్, సిబ్బంది రాము, మంజుల, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలో భారత ఉపప్రధాని, భారతరత్న బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువజన సంఘం నాయకులు మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ దేశం గర్వించదగ్గనేత అని, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో చిప్పలపల్లి రాములు, కడియం స్వామి, ఆవుల వెంకన్న, చిప్పలపల్లి మల్లేష్, చిల్పలపల్లి ఉపేందర్, యాదగిరి, పండు, శివ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

తుంగతుర్తి : భారత మాజీ ఉపప్రధాని, భారతరత్న బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బాబు జగ్జీవన్‌రామ్ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, సంతోష్, చెరుకు పరమేష్, పులుసు వెంకటనారాయణ, రాములు, జలేందర్, మహేష్, వెంకన్న, నాగమల్లు, గిరి, సాయికిరణ్, సురేష్, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుక, అధికారులు



నాగారంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



తిరుమలగిరిలో మన ఊరు-మన బడి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు -మన బడి పథకంలో భాగంగా రూ.10లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మున్సిపల్ వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, తహసీల్దార్ రమణారెడ్డి, కౌన్సిలర్లు పత్తెపురం సరిత, సంకెపల్లి జ్యోతి, గిలకత్తుల ప్రియలత, అనసూయ, బత్తుల శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, ఏఈ రవికుమార్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, కందుకూరి లక్ష్మయ్య, మూల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మద్దిరాల : రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు -మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.18లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అదే విధంగా రూ.9లక్షలతో నూతన అదనపు తరగతి గది నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్క నాటి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి ఇటీవల విద్యుదాఘాతానికి గురై గాయపడడంతో ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కలెట్లపల్లి శోభన్‌బాబు, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈఓ అశోక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ దామెర్ల శ్రీనివాస్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, రవీందర్‌రావు, కపోత్తంరెడ్డి, సర్పంచ్ రాణి శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, హెచ్ఎంలు మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

తుంగతుర్తి : మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు 100మంది కార్యకర్తలు తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్ ఏశమల్ల సుశీలసామేలు, ఎంపీటీసీ కలకోట్ల ఎలేజర్, నల్లు రామచంద్రారెడ్డి, జటంగి రవి, రాములు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈదుల మల్లయ్య, ఈటూరు గ్రామానికి చెందిన పేరాల సోమలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, యారాల రాంరెడ్డి, బాలమల్లు, చంద్రమౌళి, యాదగిరి ఉన్నారు.



మద్దిరాల : అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పట్టణంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ అబిద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, గజ్జల వెంకటరెడ్డి, చల్లమల్ల నరసింహ, ధనుంజయ్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర మల్సూర్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ, పార్లమెంట్ సోషల్ మీడియా కోకన్వీనర్ కొప్పుల క్రాంతిరెడ్డి, పట్టణ నాయకులు దాసరి వెంకన్నయాదవ్, 15వ వార్డు అధ్యక్షుడు జోగం శ్రీనివాస్, 23వ వార్డు అధ్యక్షుడు బొజ్జ పరుశరాములు, ఓబీసీ మోర్చా పట్టణ ఉపాధ్యక్షుడు రాపోలు ఉపేందర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, ఎన్.అయోధ్య, శ్రీనివాస్‌రెడ్డి, దీన్‌దయాళ్, వెంకన్న, యాదగిరి, సోమన్న, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ..

యువతకు క్రీడాస్ఫూర్తి అవసరం



క్యారమ్ ఆడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి కుమారుడు వేమన్‌రెడ్డి

పెన్‌పహాడ్ : జీవితంలో యువత ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే క్రీడా స్ఫూర్తి అవసరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తనయుడు వేమన్‌రెడ్డి అన్నారు. గురువారం జీజేఆర్ కప్ క్రీడా పోటీల్లో భాగంగా మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం, దూపహాడ్, లింగాల, న్యూబంజార హిల్స్ తండాల్లో క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా దోసపహాడ్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, తంగెళ్లగూడెం గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు షరీపుద్దీన్, బిట్టు నాగేశ్వర్‌రావు, భిక్షం, బాదె ఈశ్వరమ్మ, మామిడి అంజయ్య, ఆవుల అంజయ్య, పేర్ల శ్రీధర్, స్వర్ణ, రవి, నల్లపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం రమేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల్పకుంట్ల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బత్తుల భిక్షం జ్ఞాపకార్థం వారి కుమారులు అందించిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్వాయి భిక్షం, అంగన్‌వాడీ టీచర్లు బత్తుల రేణుక, వెంకటమల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పాఠశాలలు అభివృద్ధి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్

సూర్యాపేట రూరల్ : బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఎస్‌కె.రఫీ, బీఆర్ఎస్ నాయకులు ఏర్పుల రాజు, మామిడి ఉదయ్, కల్లెట్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

పట్టణంలోని 10వ వార్డుకు చెందిన కుప్పిరెడ్డిగూడెం నివాసి కొల్లేట్లపల్లి శ్రీను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో గురువారం డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట రేణుక, రఫీ, వెంకన్న, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి : వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు అంతా కలిసికట్టుగా పనిచేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ యూత్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాలను గ్రామ, మండల స్థాయిల్లో వేయనున్నట్లు తెలిపారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, నాయకులు అక్కెనపల్లి నరేష్, నోముల నరేష్, అక్కెనపల్లి సతీష్, శ్రావణ్, ఉపేందర్, రాజేష్, శ్రావణ్, జయంత్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



డి.కొత్తపల్లిలో మాట్లాడుతున్న మట్టపల్లి సైదులు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇచ్చేంత వరకు పోరాడుతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోటి ఆశలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లల్లో కాలంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇచ్చిన పాపన పోలేదన్నారు. లక్షలాది మంది పేద ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపికలో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇళ్ల కేటాయిస్తున్నారే తప్ప అర్హులైన పేదలకు ఇళ్ల ఇవ్వడం లేదన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.3లక్షలను రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం, కడియం కుమార్, యాదగిరి, వెంకన్న, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాకారుల అవగాహన



తుంగతుర్తి : ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తుంగతుర్తి : మండల పరిధిలోని గుట్టకిందితండాలో తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారధి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, రాధ, స్రవంతి, ప్రియదర్శిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. గురువారం మండలంలోని కొమ్మాల గ్రామంలో సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో తెలంగాణకు హరితహారం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాకారులు తమ ఆట, పాటలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గద్దం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, గజ్జి మంజుల, కుందమళ్ల నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



దాతలు అందజేసిన భోజన ప్లేట్లతో విద్యార్థులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుంచమర్తి యూపీఎస్ హెచ్‌ఎం రత్నకుమారి అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామానికి చెందిన మన్నె యల్లయ్య-లింగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు మన్నె సైదులు, వీరయ్య, లింగయ్య గురువారం పాఠశాలలోని 40మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరెడ్డి, కవిత, వీరయ్య, గ్రామస్తులు మన్నె నరేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

మద్దిరాల : మండల కేంద్రంలో గురువారం ఆరాధ్య ఫౌండేషన్ మండల నూతన కమిటీని ఆ ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తన్నీరు మహేష్, గౌరవ అధ్యక్షులుగా ఎం.సైదులు, శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా దువ్వ గిరి, ఉబ్బని వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రమేష్, కార్యదర్శిగా తునికి బద్రీ, సంయుక్త కార్యదర్శిగా దాసరి సతీష్, కోశాధికారిగా బర్పటి మురళి ఎన్నికయ్యారు. సమావేశంలో తునికి ఉపేందర్, భాషబోయిన లక్ష్మణ్, కోడి లింగన్న, కోడి వెంకన్న, అన్నెపర్తి రాంబాబు పాల్గొన్నారు.



ఎన్నికైన ఆరాధ్య ఫౌండేషన్ కమిటీ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల సమ్మె



చివ్వెంల : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ సిబ్బంది



ఆత్మకూర్-ఎస్ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయితీ కార్మికులు

ఆత్మకూర్-ఎస్ : గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు వెంకన్న మాట్లాడారు. గ్రామాలలో కింది స్థాయిలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపాలిటీ తరహా విధానాన్ని అమలు చేసి వేతనాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, బిల్ కలెక్టర్‌లను, కారోబార్‌లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. కాగా మొదటిరోజు చేపట్టిన సమ్మెకు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు కంచనపల్లి సైదులు, గీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు అబ్బగాని భిక్షం, కునుకుంట్ల సైదులు, సామ నర్సిరెడ్డి, నరేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బందారు సైదులు, ప్రధాన కార్యదర్శి బొడ్డు పీటర్, పిడమర్తి ప్రసాద్, పవన్‌కళ్యాణ్, ఎండీ షఫీ, సంధ్య, సోమమ్మ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది దీక్ష నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దూపటి బక్కయ్య, శ్యామల, నాగయ్య, మహేష్, శోభ, లక్ష్మి, సైదమ్మ, రాజు, ప్రభు, బుచ్చమ్మ, యాకయ్య పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన 30మంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : గ్రామపంచాయతీల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం మల్టీపర్పస్ వర్కర్లు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెలో సంఘం నాయకులు గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, షేక్ యాకూబ్, ప్రవీణ్, గంట వెంకన్న, బాషామియా, మహంకాళి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెలో కూర్చున్న మల్టీపర్పస్ వర్కర్లు



తిరుమలగిరిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులు